సాక్షి
అనంతపురం
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/22.8°

జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఆనర్స్‘డిగ్రీ’ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సులు బీఏ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లిష్, బీకాం జనరల్, బీఎస్సీ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కళాశాలలోని ఆయా విభాగాల్లో ఈ నెల 9లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 2020–21 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరి 2023లో పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఆనర్స్ డిగ్రీ చివరి సంవత్సరంలోకి చేరవచ్చని వెల్లడించారు. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అవకాశం ఉంటుందన్నారు. నూతన విద్యా విధానం ప్రకారం నిర్వహిస్తున్న కోర్సుల్లో భాగంగా మొదటిసారి నాలుగేళ్ల కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు యూనివర్సిటీల్లో మరో ఏడాది పాటు చదివితే పీజీ పూర్తి చేయొచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఖాద్రీశుని సేవలో జిల్లా జడ్జి



న్యాయమూర్తికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు, చైర్మన్

కదిరి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్ శనివారం ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిలో సేవలో గడిపారు. ఉదయం ఆయన ఆలయం వద్దకు చేరుకోగానే సిబ్బంది, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జడ్జి శ్రీనివాస్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పలువురు న్యాయవాదులు, సీఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ

- మున్సిపల్ కమిషనర్ పేరుతో వసూళ్లు



గుంతకల్లుటౌన్: సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో మోసాలకు తెగబడుతున్నారు. తాజాగా గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌నంటూ ఓ సైబర్ నేరగాడు (ట్రూ కాలర్ ఆధారంగా అతని పేరు జశ్వంత్‌రెడ్డి) 63095 90391, 63095 90392, 86882 68041 నంబర్ల నుంచి ఫోన్ చేసి ట్రేడ్ లైసెన్సు రెన్యూవల్ ఫీజు చెల్లించాలని పలువురిని కోరాడు. ఫీజు చెల్లించకపోతే షాపు సీజ్‌చేస్తామని ఓ జ్యువెలరీ షాపు, ఓ రెస్టారెంట్ నిర్వాహకుడితో పాటు మరికొంత మందిని భయపెట్టి, ఒక్కొక్కరి నుంచి రూ.1000 ప్రకారం ఫోన్ పే ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నకిలీ కమిషనర్ ఆడియో కాస్తా అన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పందించారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని శనివారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఫోన్ ద్వారా బకాయిలు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు అడగరని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే కార్యాలయ అధికారులను సంప్రదించాలన్నారు.







అనంతపురం నాయక్‌నగర్ ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరంలో టోకెన్లు తీసుకుంటున్న ప్రజలు, వైద్య శిబిరానికి వస్తున్న వృద్ధులు, వైద్యం చేయించుకునేందుకు వచ్చిన ప్రజలు

ఆప్యాయంగా.. ఆరోగ్య సేవలు

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వెల్లువలా జనం
- 26 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు
- 6,813 మందికి వైద్య సేవలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయి. ఇప్పటికే సచివాలయ– వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్, రేషన్, సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి చెంతకే చేరుతున్నాయి. దీర్ఘకాలిక రోగులు, వయసు పైబడిన వారితో పాటు ముందస్తుగా అనారోగ్యాలను గుర్తించి వారికి సరైన వైద్యం అందించడం ద్వారా ఆరోగ్యవంతులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట స్థానికంగానే సచివాలయాలు లేదా పాఠశాలలు లేదా అనుకూలమైన ప్రదేశాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. శనివారం జిల్లాలోని 26 ప్రాంతాల్లో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇదివరకే ఇంటింటి సర్వేలో స్క్రీనింగ్ చేయించుకున్న వారు క్యాంపులకు తరలివచ్చారు. ప్రొసీజర్ ప్రకారం రిజిస్ట్రేషన్, బీపీ, షుగర్ తదితర రక్త పరీక్షలు చేయించుకుని, స్పెషలిస్టు వైద్యులతో చూపించుకుని వైద్యుల సలహాలు, సూచనలతో పాటు మందులు ఉచితంగా పొందారు. జిల్లా వ్యాప్తంగా 6,813 మందికి వైద్య సేవలందించారు. 369 మందిని జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

విప్లవాత్మక మార్పులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయదుర్గంలోని పల్లేపల్లిలో జరిగిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరాన్ని విప్ ప్రారంభించారు.



కూడేరు మండలం కొర్రకోడు ‘ఆరోగ్య సురక్ష’ శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు మెడికల్ క్యాంపులకు వచ్చి వైద్య సేవలు పొందాలని సూచించారు.

- అనంతపురంలోని అరవిందనగర్ ఎస్కేడీ స్కూల్‌లో జరిగిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. పేదలపై ఆర్థిక భారం పడకుండా విద్య, వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు.
- బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
- కూడేరు మండలం కొర్రకోడులో జరిగిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ వైద్య శిబిరంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ‘ఆరోగ్య సురక్ష’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి గుత్తి, గుంతకల్లు, అనంతపురంలో జరిగిన వైద్య శిబిరాలను పర్యవేక్షించారు

‘ఆరోగ్య సురక్ష’ చిత్తశుద్ధితో నిర్వహించాలి



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్‌పై పురోగతి తక్కువగా ఉందంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణపై కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ఎదురవుతున్న చిన్నపాటి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి మరింత ప్రభావవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్యాంపుల నిర్వహణ ఉండాలన్నారు. ఇంటింటి క్యాంపెయిన్ పక్కాగా నిర్వహించాలన్నారు. ఒక గ్రామంలో క్యాంపు నిర్వహించేందుకు రెండు రోజులకు ముందుగానే ఇంటింటి సర్వే వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలన్నారు.

క్యాటరాక్ట్ కేసులు వస్తున్నాయి

క్యాంపుల్లో కంటి వెలుగుకు సంబంధించి క్యాటరాక్ట్ కేసులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఎక్కువగా ప్రభుత్వ సర్వజనాస్పత్రికే రెఫర్ చేస్తున్నారన్నారు. అలా కాకుండా క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేసే సౌకర్యం ఉన్న ఏరియా ఆస్పత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. డ్రగ్స్ కౌంటర్‌లో ఫార్మసిస్ట్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీఈఆర్ నమోదుకు కార్యాచరణ

అనంతపురం అర్బన్: జిల్లాలో స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో–జీఈఆర్) నమోదుకు కార్యాచరణ చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ గౌతమి తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, స్పందన గ్రీవెన్స్, తదితర అంశాలపై సీఎస్ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ గౌతమి తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. జిల్లాలో కార్యక్రమాల అమలు తీరుపై సీఎస్‌కు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. జిల్లాలో వందశాతం స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) నమోదు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. వయసు 5 ఏళ్ల నుంచి 18 ఏళ్ల ఉన్న ప్రతి ఒక్కరినీ పాఠశాలల్లో చేర్పించేలా కార్యాచరణ చేపట్టామన్నారు. జిల్లాలో 4,02,336 మంది విద్యార్థులకు గానూ 4,02,230 మందిని సర్వే చేశామన్నారు. బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

‘అనంత సంకల్పం’ కింద ప్రత్యేక తరగతులు

పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు ‘అనంత సంకల్పం’ కార్యక్రమం కింద ప్రత్యేక తగరతులు నిర్వహిస్తున్నామని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. పరీక్షలకు 100 రోజులు ముందు నుంచి ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన పాఠాలపై ప్రత్యేక బోధన చేయిస్తున్నామన్నారు. రెగ్యులర్ పదవ తరగతి విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన వారికీ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో, కళాశాలలో చేరేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. జిల్లాలో వివిధ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఎస్‌కు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ ప్రశాంత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహషాన్ బాషా, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారి సురేంద్ర, డీఈఓ నాగరాజు, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, డీఐఓ గంగాధర్, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు పౌష్టికాహారం

- కార్డుదారులకు ఉచితంగా రాగులు
- జిల్లాలో 6.63 లక్షల బియ్యం కార్డులు
- నెలకు సగటున 477 టన్నుల రాగుల పంపిణీ

రాగుల పంపిణీ ఇలా

నెల	కిలోలు
జూన్	2,90,257
జూలై	7,17,113
ఆగస్టు	5,10,873
సెప్టెంబరు	3,91,477
అక్టోబరు (శనివారం వరకు)	1,60,767



కార్డుదారులకు బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ప్రజల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రధానంగా పేదలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కార్డుదారులకు పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు రాగులను ఉచితంగా పంపణీ చేస్తోంది. కార్డుదారులు తమ ఇష్టం మేరకు ప్రతి నెలా కిలో నుంచి మూడు కిలోలు రాగులు పొందవచ్చు. సగటున ప్రతి నెలా 477 టన్నులు రాగులను కార్డుదారులు అందుకుంటున్నారు.

నెలసరి రూ.1.90 కోట్లు

జిల్లావ్యాప్తంగా 6,63,929 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు 660 టన్నులు రాగులను జిల్లాకు కేటాయిస్తోంది. జూన్‌లో 290 టన్నులు, జూలైలో 717 టన్నులు, ఆగస్టులో 510 టన్నులు, సెప్టెంబరులో 391 టన్నుల రాగులు అందజేశారు. ఈ నెల (అక్టోబర్) ఇప్పటి వరకు 160 టన్నులు రాగులను కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వం కిలో రాగులకు రూ.40 ఖర్చుస్తోంది. జిల్లాలోని కార్డుదారులకు సగటున నెలసరి 477 టన్నుల రాగులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ లెక్కన పేదలకు పౌష్టికమైన రాగులు అందించేందుకు ప్రభుత్వం ప్రతినెలా రూ.1.90 కోట్లు ఖర్చు చేస్తోంది.

నాణ్యమైనవే అందిస్తున్నాం



ప్రభుత్వం నాణ్యమైన రాగులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుండడంతో రాగులపై పొట్టు కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం, రాగులు, ఇతర సరుకుల నాణ్యత గురించి కార్డుదారులతో మాట్లాడి వారి అభిప్రాయం తీసుకుంటుంటాం. సరుకుల నాణ్యత విషయంలో కార్డుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ లేవు.

– శోభారాణి, జిల్లా సరఫరాల అధికారి

రాగులు బాగున్నాయి



“ కార్డుదారులకు ప్రభుత్వం ప్రతి నెలా రాగులు ఇవ్వడం మంచి కార్యక్రమం. రాగుల నాణ్యత కూడా బాగుంది. మేము ప్రతి నెలా రాగులు తీసుకుంటాము. పేదలకు నాణ్యమైన బియ్యంతో పాటు రాగులను ఉచితంగా పంపిణీ చేస్తుండడం చాలా సంతోషం.

– లక్ష్మీదేవి, సిద్ధరామపురం, బుక్కరాయసముద్రం మండలం

పేదల గురించి ఆలోచిస్తోంది



బయట కొనాలంటే కిలో రాగులు రూ.40 అవుతుంది. అలాంటిది మాలాంటి పేదవారికి ప్రభుత్వం బలవర్ధక ఆహారమైన రాగులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. పేదల సంక్షేమ, ఆరోగ్యశ్రేయస్సు గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుండటం శుభపరిణామం.

– లక్ష్మీనరసమ్మ, సనప, ఆత్మకూరు మండలం

మంచి రాగులు ఇస్తున్నారు



ఇది వరకు ఎప్పుడూ పేదలకు ఉచితంగా రాగులు ఇవ్వలేదు. ప్రతి నెలా నాణ్యమైన బియ్యంతో పాటు మంచి రాగులు ఉచితంగా ఇస్తున్నారు. రాగులలో పొట్టు సహజంగా ఉంటుంది. చెరిగితే పోతుంది. మేము ప్రతి నెలా రాగులు తీసుకుంటాం.

– చంద్రకళావతి, బుక్కచర్ల, రాప్తాడు మండలం

పప్పుశనగ పంపిణీకి ఏర్పాట్లు

- 40 శాతం రాయితీతో 27,266 క్వింటాళ్ల విత్తనం కేటాయింపు
- ఇప్పటికే 20 వేల క్వింటాళ్లకు 13 వేల మంది రిజిస్ట్రేషన్
- 21 మండలాల్లో 72 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు అంచనా

అనంతపురం అగ్రికల్చర్: నల్లరేగడి భూముల్లో రబీ ప్రధాన పంటగా పప్పుశనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం రాయితీతో విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసింది. వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ద్వారా సోమవారం నుంచి 21 మండలాల పరిధిలో ఆర్‌బీకే వేదికగా సబ్సిడీ విత్తన పప్పుశనగ పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే 20 వేల క్వింటాళ్ల విత్తనం కోసం 13 వేల మంది రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అలాగే ఏపీ సీడ్స్ ద్వారా 125 ఆర్‌బీకేల్లో 11 వేల క్వింటాళ్ల వరకు నిల్వ చేశారు.

గరిష్టంగా 200 కిలోల పంపిణీ

ఖరీఫ్‌లో వర్షాభావం, రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రబీ సాగుకు 40 శాతం రాయితీతో విత్తనం పంపిణీకి చర్యలు చేపట్టింది. అలాగే ఒక్కో రైతుకు గరిష్టంగా 200 కిలోలు విత్తన పప్పుశనగ ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో 25 శాతం సబ్సిడీ, గరిష్టంగా 125 కిలోలు విత్తనం పంపిణీ చేశారు. ప్రస్తుతం క్వింటా విత్తనం పూర్తి ధర రూ.8,100 కాగా.. అందులో 40 శాతం రూ.3,240 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.4,860 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాకు 27,266 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ కేటాయించారు. ఒక ఎకరా ఉన్న రైతులకు 20 కిలోలు కలిగిన రెండు బస్తాలు అంటే 40 కిలోలు, రెండు ఎకరాలకు 80 కిలోలు, మూడు ఎకరాలకు 120 కిలోలు, నాలుగు ఎకరాకు 160 కిలోలు, ఐదు అంతకన్నా ఎక్కువ ఉన్న రైతులకు 10 ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.

21 మండలాల్లో పంపిణీ

అనంతపురం, ఆత్మకూరు, కూడేరు, బుక్కరాయసముద్రం, బెళుగుప్ప, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుత్తి, పెద్దవడుగూరు, పామిడి, శింగనమల, యాడికి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు సహా 21 మండలాల్లో విత్తన పప్పుశనగ పంపిణీ చేయనున్నారు. 72వేల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పుశనగ సాగులోకి రావొచ్చని అధికారులు భావిస్తున్నారు.

పాత నేరస్తులపై గట్టి నిఘా

అనంతపురం క్రైం: రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై గట్టి నిఘా ఉంచాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. శనివారం జిల్లాలోని ఐదు డివిజన్ల పరిధిలో ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ చేశారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది బృందాలుగా వెళ్లి 450 మంది చురుకైన రౌడీషీటర్ల ఇళ్లు, సస్పెక్ట్ షీట్లకు సంబంధించి 500 ఇళ్లు, పాత ఎక్సైజ్ కేసుల్లోని 200 మంది నిందితుల ఇళ్లు, వాముదొడ్లు, తోటలు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం పోలీసులు విజిబుల్ పోలీసింగ్, గ్రామసభలు నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

క్లుప్తంగా

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి


మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్ కుమార్

అనంతపురం క్రైం: క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులతో పరేడ్, దర్బార్ కార్యక్రమాలను శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిత్యం గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రయాణ సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్‌లు రెన్యూవల్ అవుతున్నాయా లేదా చూసుకోవాలన్నారు. సమస్య వస్తే సబ్ డివిజన్ ఇన్‌చార్జ్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించాలనే విషయాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో హెచ్‌జీఎస్ డీఎస్పీ మునిరాజ, హెచ్‌జీఎస్ ఆర్ఐ హరికృష్ణ, హెచ్‌జీఎస్ ఆర్ఎస్ఐ మక్బూల్, శ్రీరాముడు, సబ్ డివిజన్ల హోంగార్డుల ఇన్‌చార్జ్‌లు, హోంగార్డులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాలో వారాబందీ

- అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాల పంపిణీకి అధికారుల నిర్ణయం
- 10 నుంచి 20 వరకూ గుంతకల్లు డివిజన్‌లో తూములకు నీటి నిలుపుదల



శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ	92.486 టీఎంసీలు
హంద్రీ-నీవా ద్వారా జిల్లాకు వస్తున్న కృష్ణాజలాలు	1,386 క్యూసెక్కులు
జీడిపల్లి జలాశయంలోకి వస్తున్న నీరు	648 క్యూసెక్కులు
చెర్లోపల్లికి..	100 క్యూసెక్కులు
ఇంకా నింపాల్సిన రిజర్వాయర్లు	మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కుప్పం వరకూ...

అనంతపురం సెంట్రల్: శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ-నీవా ద్వారా జిల్లాకు వస్తున్న కృష్ణా జలాలను అన్ని ప్రాంతాలకు సమంగా పంపిణీ చేసేందుకు అధికారులు వారాబందీ (ఆన్‌అండ్‌ఆఫ్) అమలుకు శ్రీకారం చుడుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో శ్రీశైలం జలాశయానికి ఆశించిన స్థాయిలో నీరు రాలేదు. ఈ క్రమంలో తక్కువ సమయంలో వీలైనంత ఎక్కువ నీటిని తీసుకురావడంతో పాటు అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నీటి అవసరాలు తీర్చేందుకే..

నాలుగేళ్లుగా జిల్లావాసులను ఆదుకున్న హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ఈ ఏడాది నీటి ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ మొత్తం వర్షాకాలంలో శ్రీశైలం జలాశయం ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో నిండలేదు. అయినప్పటికీ జిల్లాలో నీటి అవసరాల దృష్ట్యా వీలైనంత ఎక్కువ నీటిని తీసుకొస్తున్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో నీటి అవసరాలు అధికమవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం నుంచి హంద్రీ-నీవా ద్వారా జిల్లా సరిహద్దులో 1,386 క్యూసెక్కుల నీరు వస్తోంది. గుంతకల్లు డివిజన్‌లో ఆలూరు బ్రాంచ్ కెనాల్, గుత్తి బ్రాంచ్ కెనాల్‌తో పాటు చెరువులు అధికంగా ఉన్నాయి. దీంతో దాదాపు 600 క్యూసెక్కుల నీటిని ఇంత వరకూ వాడుతూ వచ్చారు. జీడిపల్లి జలాశయం నుంచి దిగువన ఉన్న మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లతో పాటు పుంగనూరు బ్రాంచ్ కెనాల్, కుప్పంకు నీటిని తీసుకెళ్లేందుకు ఆయా రిజర్వాయర్లలో నీరు నిల్వ చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జీడిపల్లి నుంచి చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే అక్కడికి చేరేలోపు కేవలం 100 క్యూసెక్కులలోపే నీరు ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతికి అధికారులు శ్రీకారం చుడుతున్నారు. గుంతకల్లు డివిజన్‌లో 600 క్యూసెక్కుల నీటి వినియోగం తగ్గితే, కిందకు సులువుగా వేగంగా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

శ్రీశైలంలో 92 టీఎంసీలు..

ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 92 టీఎంసీల నీటి నిల్వ ఉంది. హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకానికి 53 టీఎంసీల(834 అడుగులు) వరకూ నీటిని తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. దీన్నిబట్టి చూస్తే మరికొన్ని నెలల పాటు హంద్రీ-నీవాకు కృష్ణాజలాలు రానున్నాయి. ఈ లోగా మంచి వర్షాలు వస్తే నవంబర్, డిసెంబర్ వరకూ ఢోకా లేదని అధికారులు చెబుతున్నారు. పంటల సాగుకు లేదని,ఇదివరకే ఐఏబీ(సాగునీటి సలహా మండలి) సమావేశంలో నిర్ణయం తీసుకున్నా, రైతుల సంక్షేమం దృష్ట్యా నీటిని వదులుతున్నారు. అన్ని ప్రాంతాలకు నీటిని పంపిణీ చేసి రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందుల ఎదురు కాకుండా ఉండేందుకు కృష్ణాజలాలు దిగువకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. అందులో భాగంగా గుంతకల్లు డివిజన్‌లో ఈనెల 10 నుంచి 20 తేదీ వరకూ తూములకు నీటిని నిలుపుదల చేయాలని నిర్ణయించారు. 20 తేదీ తర్వాత మళ్లీ విడుదల చేయనున్నారు.

రైతులు సహకరించాలి

జిల్లాలో అన్ని ప్రాంతాలకు సమానంగా కృష్ణాజలాలను తీసుకుపోయేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా వారాబందీ (ఆన్‌అండ్‌ఆఫ్) పద్ధతిని అమలు చేస్తున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు దిగువకు నీరు వెళ్లేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. మెయిన్‌కెనాల్‌లో నిరంతరంగా నీరు సరఫరా అయ్యేందుకు రైతులు, ప్రజలు సహకరించాలి. గుంతకల్లు డివిజన్‌లో పది రోజుల పాటు నీటిని నిలుపుదల చేస్తున్నాం. తర్వాత మళ్లీ నీటిని విడుదల చేస్తాం. ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

– దేశేనాయక్, ఎస్ఈ, హంద్రీ-నీవా

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

పెద్దవడుగూరు: ద్విచక్ర వాహన దొంగలు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాడికి సర్కిల్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం గుత్తి-అనంతపురం మార్గంలోని గేట్స్ కళాశాల వద్ద నిందితులను అరెస్టు చేశామన్నారు. గుత్తి మండలం తొండపాడుకు చెందిన డేగ హరి, చబిలి కృష్ణ, పిక్కిలి సుధాకర్, కట్టుబడి దివాకర్, నంద్యాల టౌన్‌కు చెందిన సానే చంద్ర ఉన్నట్లు గుర్తించామన్నారు. వారి నుంచి 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

యాడికి: అక్రమంగా తరలిస్తున్న 430 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. యాడికి మండల కేంద్రంలో కోన రోడ్డులోని ఫీడర్ కాలువ పక్కన ఉన్న దేరంగుల దాసు వ్యవసాయ పొలంలోని రేకుల షెడ్డులో శ్రీ సత్యసాయి జిల్లా బసంపల్లెకు చెందిన రమేష్, యల్లనూరు మండల కేంద్రానికి చెందిన శివకుమార్ దాదాపు 230.4 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉంచారు. శనివారం రెండు వాహనాల్లో బియ్యాన్ని తరలించే సమయంలో విజిలెన్స్ సీఐ వెంకటరమణ తన సిబ్బందితో పట్టుకున్నారు. పోలీసుస్టేషన్‌కు తరలించారు. రమేష్, శివకుమార్‌పై కేసు నమోదు చేశారు. యాడికి సివిల్ సప్లయీస్ డీటీ సూర్యనారాయణ రేషన్ బియ్యాన్ని యాడికి ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, యాడికి ఆర్ఐ ఆనందబాబు ఆచారి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులను చూపుతున్న పోలీసులు

బెళుగుప్ప: కారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ శ్రీరామకృష్ణ ఆదేశాల మేరకు శనివారం గంగవరం క్రాస్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో కళ్యాణదుర్గం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఓ ఇండికా కారు (నంబర్ కేఏ05 ఎంఏ 7379) అక్కడికి వచ్చింది. తనిఖీ చేయగా 12 బాక్సులలో 1,152 హైవార్డ్స్ మద్యం బాటిళ్లు కనిపించాయి. సుమారు రూ.46,500 విలువ గల ఆ మద్యం బాటిళ్లతో పాటు దిల్‌షాద్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అంకెలనారాయణ అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ అనంతపురం సీఐ కే.శ్రీనివాసులు, కళ్యాణదుర్గం సబ్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణానాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


లక్ష్మీ మృతదేహం

గుమ్మఘట్ట: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బేలోడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన చాకలి తిప్పేశ్, లక్ష్మీ (32) దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తిప్పేశ్ తమలపాకుల తోటల్లో పనిచేసేవాడు. లక్ష్మీ కూలి పనులు చేసుకుని జీవనం చేసేవారు. మద్యానికి బానిసైన తిప్పేశ్ కొన్ని రోజులుగా నిత్యం భార్యతో గొడవ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి కూడా భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీ జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం కుటుంబసభ్యులు గుర్తించి కిందికి దించగా, అప్పటికే ప్రాణాలు విడిచింది. దీంతో వారు గుండెలవిసేలా రోదించారు. రూరల్ సీఐ యుగంధర్, ఎస్ఐ సునీత ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్పీ అన్బురాజన్


మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం మెడికల్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. శనివారం అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలోని సెంట్రల్ హాలులో నిర్వహించిన ర్యాగింగ్ నిరోధక అవగాహన కార్యక్రమానికి ఎస్పీ అన్బురాజన్‌తో పాటు సీనియర్ సివిల్ జడ్జి దీన, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కే. శ్రీనివాస రావు హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ వైద్య కళాశాలలో ర్యాగింగ్ కేసులు నమోదుకాకుండా ప్రిన్సిపాల్, యాంటీ ర్యాగింగ్ కమిటీ తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. పేద విద్యార్థులు కష్టపడి వైద్య విద్య ఎంచుకుంటారని, ర్యాగింగ్ మూలాన ఎవరూ నష్టపోకూడదని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి దీన మాట్లాడుతూ కులం, మతం పేరుతో, ధనిక, పేద భావంతో ఒక మనిషిని బాధపెడితే దాన్ని ర్యాగింగ్‌గా పరిగణిస్తారన్నారు. ఇందుకు కఠిన శిక్షలు విధించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. పురుష, మహిళల వసతి గృహాలను పోలీసులతో కలసి సందర్శించామని, విద్యార్థుల సంక్షేమం పట్ల కళాశాల యాజమాన్యం కనబరుస్తున్న శ్రద్ధ, అమలు చేస్తున్న విధానాలు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస రావు మాట్లాడుతూ అత్యున్నత వైద్య, విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు దేశ నిర్మాణంలో భాగం కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాల విడుదల


జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్-20), (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ రెండో రెండో సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్ jntuaresults.ac.in సంప్రదించాలన్నారు.

అవినీతి చక్రవర్తి చంద్రబాబు

- గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ధ్వజం



గుత్తి: టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి చక్రవర్తి అని గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఎమ్మెల్యే ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుపై టీడీపీ నాయకులు, పచ్చ మీడియా నానా యాగీ చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ఆయన అక్రమాలకు పాల్పడినట్లు 140 మంది సాక్షులు చెప్పారన్నారు. స్వయంగా చంద్రబాబు 13 చోట్ల డిజిటల్ సైన్ చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సూత్రధారి, పాత్రధారి చంద్రబాబు అని జీఎస్టీ, సీఐడీ విచారణలో తేలిందన్నారు. పక్కా ఆధారాలు ఉండబట్టే కోర్టు రిమాండ్‌కు పంపిందన్నారు. అలాంటి వ్యక్తి సచ్ఛీలుడు, నీతిమంతుడు అన్నట్లు టీడీపీ శ్రేణులు, పచ్చ మీడియా నానా యాగీ చేస్తుండడం విడ్డూరమన్నారు. ప్రజలకు అన్నీ తెలుసని, వారిని ఇంకా మోసగించలేరన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ఒక్కటే కాదు, అవుటర్ రింగ్ రోడ్డు, ఏపీ ఫైబర్‌నెట్ ఇలా అనేక కేసుల్లో నిందితుడిగా చంద్రబాబు ముందు వరుసలో ఉన్నారని పేర్కొన్నారు. గతంలో స్టేలు తెచ్చుకున్న 17 కేసులు కూడా రీ ఓపెన్ చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబుది అక్రమ అరెస్టు అంటూ ధర్నాలు, ఆందోళనలు, రిలే దీక్షలు చేస్తుండడం కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని, వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి బాబుకు పచ్చ మీడియాతో పాటు దత్తపుత్రుడు తోడయ్యాడని, ఎంత మంది కలిసి వచ్చినా జగన్ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాలకు పోటీ చేసి అన్నిటినీ గెలవబోతోందని జోస్యం చెప్పారు. చంద్రబాబు, పవన్‌కు దమ్ము, ధైర్యముంటే సింగిల్‌గా 175 స్థానాల్లో పోటీ చేయాలని సవాల్ చేశారు.

'మిషన్ వాత్సల్య' అమలులో జాప్యమేల?


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేల ఉపకార వేతనం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'మిషన్ వాత్సల్య' పథకం అమలులో ఎందుకు జాప్యం జరుగుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం-5 (స్త్రీ, శిశు సంక్షేమ శాఖ) సమావేశం శనివారం బెళుగుప్ప జెడ్పీటీసీ సభ్యురాలు మమత అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు తాడిపత్రి, తాడిమర్రి జెడ్పీటీసీ సభ్యులు కురుబ రమణమ్మ, పార్లా సావిత్రి హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకానికి అర్హులను ఎంపిక చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి స్పందిస్తూ.. దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు అందలేదని, ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

- జనాభాకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తాడిపత్రి జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ కోరారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకూ గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. తాడిమర్రి జెడ్పీటీసీ సభ్యురాలు సావిత్రి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాసిరకం సరుకులు పంపుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు నెలకోసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.
- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణతో పాటు ఉచితంగా మిషన్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రతిపాదనలు, అంచనాలు తయారు చేసి పంపితే, ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన కంబగిరి రాముడు

తాడిపత్రి అర్బన్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ కథనం మేరకు.. యాడికి మండలం వేములపాడుకు చెందిన మాజీ సర్పంచ్ చిటికెల కంబగిరి రాముడు (57) శనివారం ఉదయం తన టీవీఎస్ ఎక్సెల్‌లో తాడిపత్రికి పనుల నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అశోక్‌పిల్లర్ సమీపంలో ఇండియన్ గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. కిందపడిన కంబగిరి రాముడు పొట్టపై లారీ ముందు టైరు వెళ్లింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమారుడు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని లారీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక


బాస్కెట్ బాల్ అండర్-14 బాలుర జట్టు

అనంతపురం: జిల్లా అండర్-14, అండర్ -17 బాస్కెట్ బాల్ బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుగుణమ్మ, సమన్వయకర్త ఎల్. నాగరాజు, పీఈటీ, పీడీలు గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, ఈశ్వర రెడ్డి, బి. నాగరాజు, కోటప్ప, ఓబులేసు ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ పోటీలు అన్నమయ్య జిల్లాలో జరగనున్నాయని, అందులో ఈ జట్లు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

అండర్-14 బాలికల జట్టు..

సి. హిమవర్షిత, వి. సింధు శ్రీ, ఎస్. షాలిని, ఎస్. దేదీప్రియ సాయి, కే. వాణిశ్రీ, బి. శ్రావ్య, ఎం. యశస్విణి, ఏ. అక్షయ, పి. ప్రశాంతి, డి. భవిత, జి. గోపిక

అండర్-14 బాలురు..

ఎస్. నవ కిరణ్, బి. హర్షవర్ధన్, కే. కౌశిక్ రెడ్డి, ఎం. కార్తీక్ నాయక్, ఈ. కౌశిక్, బి. ఉజ్వలేశ్వర్,ఎస్. అహమ్మద్, ఎం. యాగ్నిక్, ఎస్. బాబా, కే. రవితేజ, ఆర్. రవితేజ, బి. నంద కిశోర్.

అండర్-17 బాలికలు..

ఎస్. సల్మా, బి. నిత్యశ్రీ, జి.కిరణ్మయి, బి. కీర్తన, కేవీ యామిని, జి. పరిమల, పి. పూజిత, ఎం. మానస, ఎస్. నవ్యశ్రీ, డి. పావని, టి. కవిత, వై. లహరి

అండర్-17 బాలురు

సి. నవతేజ రెడ్డి, బి.చైత్రేష్, టి. విజయ్, ఎస్. మహమ్మద్, జి. సూర్య ప్రకాష్, డి. మహమ్మద్ ఆసిఫ్, ఎస్. శివ, టి. సాయి సాత్విక్ వర్ధన్, యు.నితేష్ కుమార్, ఆర్. లక్ష్మీ నరసింహా, టి. హర్షవర్ధన్, పి. హేమచంద్ర.

క్లుప్తంగా

పారదర్శకంగా చీనీ విక్రయాలు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ విక్రయాలు పారదర్శకంగా జరగాలని యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్‌లో మండీ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చీనీ రైతులకు అండగా ఉండేలా గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మోసాలకు పాల్పడినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సెక్రటరీ రాజ్యలక్ష్మి, పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చిత్రకారుడు కత్తి విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూళ్లు, కాలేజీలు, కళాసంస్థల్లో విద్యార్థులు, మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెల్: 83093 32848లో సంప్రదించాలని కోరారు.

వాహనాల తనిఖీ



రోడ్డు నిబంధనలు తెలియజేస్తున్న ఎస్‌ఐ జనార్దన్

ఆత్మకూరు: మండల కేంద్రంలోని బైపాస్ వద్ద శనివారం ఎస్‌ఐ జనార్దన్ వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తప్పనిసరిగా వాహనదారులు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించరాదని, ఆటోడ్రైవర్లను హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

నేడు సంపత్కుమార జీయర్ స్వామీజీ రాక

అనంతపురం కల్చరల్: త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ ఆదివారం నగరానికి రానున్నారు. నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యదేశ పెరుమాళ్లపై ప్రవచనం చేస్తూ సాగుతున్న యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వామి దివ్య అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు.

చైతన్య స్కూల్‌లో 'బీ హెల్తీ-బీహ్యాపీ'



విద్యార్థినులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 'బీహెల్తీ–బీహ్యాపీ' పేరుతో శనివారం వైద్య సదస్సు ఏర్పాటు చేశారు. వైద్యనిపుణులు వెంకట కార్తీక్, సంధ్య విద్యార్థినులకు దంత పరీక్షలు చేశారు. చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా వ్యాయామం, యోగా శారీరక, మానసికోల్లాసం కలిగించే కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ, ఇన్‌చార్జ్ చంద్ర మోహన్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

రాప్తాడు: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అంజనేయులు తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతూ మండలంలోని యర్రగుంటకు చెందిన నాగార్జున, రాఘవేంద్ర కొంతకాలంగా కర్ణాటక మద్యం తీసుకొచ్చి, గ్రామంలో విక్రయిస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా ఫిర్యాదు అందిందన్నారు. వారి నుంచి 90 ఎంఎల్ 50 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా కర్ణాటక మద్యం అమ్మినా, పేకాట, మట్కా ఆడినా సెల్: 9440796817లో సమాచారం ఇవ్వాలన్నారు.

వై నాట్ 175కు సన్నద్ధమవుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



హాజరైన గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమ విప్లవం, అభివృద్ధి కొనసాగాలంటే సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావాలని, ఎన్నికలకు మరో ఐదు నెలలు మాత్రమే గడువు ఉందని, వై నాట్ 175కు ప్రతి ఒక్కరూ సన్నద్ధమవ్వాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అశోక్‌నగర్‌లోని యాపిల్ గార్డెన్స్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంపై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో క్లస్టర్ 3, 5 పరిధిలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి ప్రభుత్వం త్వరలో చేపట్టబోవు కార్యక్రమానికి సంబంధించి పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించాలని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి:
దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అవినీతికి ఆస్కారం లేకుండా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ చేసేలా చర్యలు తీసుకున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నారు. డ్వాక్రా రుణాల మాఫీను నాలుగు దశల్లో చేస్తామని చెప్పి ఇప్పటికే మూడు దశల్లో రూ.19 వేల కోట్లు అందించారని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మరో రూ.5 వేల కోట్లు మాఫీకి సంబంధించిన డబ్బును ప్రభుత్వం అందిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో రూ.1300 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, కాలువలు నుంచి ప్రధాన రోడ్లు, బ్రిడ్జిలతో పాటు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్, క్రిటికల్ కేర్ బ్లాక్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఏపీ ప్రభుత్వ వాటాను విడుదల చేసినట్లు తెలిపారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి:
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ, జనసేన, బీజేపీ, ఎల్లో మీడియా కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు జరిగిన అన్యాయం, నియోజకవర్గంలో కుంటుబడిన అభివృద్ధి, అరాచకాలు, దౌర్జన్యాలు తదితర వాటిని ప్రజలకు వివరించాలన్నారు. దసరా పండుగ వెళ్లాక ఈ కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి సచివాలయ పరిధిలో పార్టీ శ్రేణులు రోజూ 15 నుంచి 20 ఇళ్లకు వెళ్లి ప్రతి ఇంటి వద్ద 10 నుంచి 20 నిమిషాల సమయం కేటాయించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన, చంద్రబాబు దగా పాలన మధ్య తేడాలను తెలియజేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, వీరా రామకృష్ణారెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, దూదేకుల హుస్సేన్, ఎంపీటీసీ ఆశాజ్యోతి, రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, రూరల్ సర్పంచ్ ఉదయ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు హసినా, రమాదేవి, అనిల్‌కుమార్ రెడ్డి, దుర్గాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం మెడికల్: పేదలకు పైసా ఖర్చు లేకుండా విద్య, వైద్యం ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని అరవిందనగర్ ఎస్‌కేడీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు స్పందన..
అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో 21 వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్బన్ ప్రాంత ప్రజలకు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, రూరల్‌లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఫ్యామిలీ కాన్సెప్ట్ ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు సాకే చంద్ర, వైఎస్సార్‌సీపీ నేత చవ్వా రాజశేఖర్ రెడ్డి, నాయకులు శోభారాణి, అంజలి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్య సేవలు



రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లిలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని వైద్యాధికారి శివకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి ప్రారంభించారు. 280 మందికి వైద్య పరీక్షలు చేశారు. క్యాంపునకుగ్రామ ప్రజలే కాకుండా చుట్టూ పక్కలా గ్రామాల ప్రజలు తరలి వచ్చి, బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర, మలేరియా, డెంగీ తదితర ఆరోగ్య పరీక్షలుతో పాటు శస్త్ర చికిత్స పరీక్షలు, కంటి పరీక్షలు చేశారు. మందులు కూడా పంపిణీ చేశారు. వీరితో పాటు 8 మందిని శస్త్ర చికిత్సల కోసం రెఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, ఎంపీటీసీ సభ్యురాలు భోగే లక్ష్మీదేవి, గొర్రెలు, మేకలు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహాగౌడ్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు బోగే రామచంద్రా రెడ్డి, కపాడం కుల్లాయప్ప, బుడగ నాగరాజు, పసుపుల శేఖర్, కపాడం నాగన్న, కృష్ణాపురం రవి, నీరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రౌడీ షీటర్, టీడీపీ నేత ఉప్పర శ్రీనివాసులుకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

రాప్తాడు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివా రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన ఇటుకులపల్లి సీఐ నరేంద్ర రెడ్డి, రాప్తాడు, ఆత్మకూరు ఎస్‌ఐలు ఆంజనేయులు, జనార్దన్‌తో కలిసి మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన ప్రసన్నాయపల్లి గ్రామంలో నాకా బందీ నిర్వహించి, గ్రామంలో రౌడీ షీటర్లు, హత్యకేసుల్లో నిందితులు, అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు, కొత్త వ్యక్తులు కనిపించినా డయల్ 100, ఎస్‌ఐ సెల్: 9440796817 సమాచారం ఇవ్వాలన్నారు.

వర్సిటీ పరిధిలోకి 'ఎస్‌ఐఐ' ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఉన్న సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజన్ (ఎస్‌ఈఐ) అధ్యయన కేంద్రంలో పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇక నుంచి వర్సిటీ లేదా యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నుంచి జీతాలు చెల్లించాలని రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జే శ్యామల రావు ఉత్తర్వులు జారీ చేశారు. 16 సంవత్సరాలుగా యూజీసీ కింద ఈ కేంద్రం పనిచేస్తోంది. ఇది వరకు యూజీసీనే వీరికి జీతాలు చెల్లిస్తోంది. అయితే, ఈ అధ్యయన కేంద్రంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి చెల్లిస్తున్న జీతాలను ఇక నుంచి నేరుగా బ్లాక్‌గ్రాంట్ నుంచి అందించాలని ఆదేశాలు అందాయి. ఒకవేళ యూజీసీ నిధులు మంజూరు చేస్తే యథాతథంగా జీతాలు, అధ్యయన కేంద్రానికి సంబంధించిన పరిశోధనలు నిర్వహిస్తారు. ఇది వరకు ఖాళీగా ఉన్న పోస్టులకు ఈ నిబంధన వర్తించదు. డి. శ్రీనివాస రావు (అసిస్టెంట్ ప్రొఫెసర్– కమ్– అసిస్టెంట్ డైరెక్టర్), డాక్టర్ కే. వెంకట రెడ్డి (అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్ అసిస్టెంట్ డైరెక్టర్), బి. పద్మావతి (రీసెర్చ్ అసిస్టెంట్), డాక్టర్ భోగే కొండా రెడ్డి (రీసెర్చ్ అసిస్టెంట్), టి. కృష్ణా రెడ్డి (ప్రొఫెషనల్ అసిస్టెంట్), బీజీ నర్మద (డేటా ఎంట్రీ ఆపరేటర్), జి. ప్రశాంత్ రెడ్డి (డేటా ఎంట్రీ ఆపరేటర్), ఎం. వరలక్ష్మి (అటెండర్)ను వర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. అయితే ఈ ఆదేశాలను వర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆమోదించాల్సి ఉంది.

కృష్ణా జలాల పంపిణీపై రాయలసీమకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

అనంతపురం టవర్‌క్లాక్: కృష్ణాజలాల పంపిణీపై రాయలసీమకు అన్యాయమేనని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం అప్పర్ భద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, రాయలసీమకు నీళ్లు రాకుండా చేస్తోందన్నారు. కృష్ణా జలాలు చాలక రాయలసీమ గొంతు ఎండే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం నీటి కేటాయింపులు జరిగిన తరువాత బ్యాక్ వాటర్‌పైనే అనంతపురం జిల్లా ఆధారపడి ఉందన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హంద్రీ–నీవా ద్వారా జీడిపల్లి రిజర్వాయర్, చిత్తూరు జిల్లా వరకూ 50 టీఎంసీల నీటిని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇది కేవలం బ్యాక్ వాటర్‌పై ఆధారపడిందని, కృష్ణా నుంచి శ్రీశైలంకు నీళ్లు వెళ్లకపోతే దాదాపు అన్ని సాగునీటి ప్రాజెక్టులూ వృథా అవుతాయన్నారు. కృష్ణా నీటిని రాయలసీమ, అనంతపురం జిల్లాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గాజుల వాసు, నగర మైనార్టీ అధ్యక్షులు శర్మాస్‌వలి, ఎంఎండీ ఇమాం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



ప్రసంగిస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు

అనంతపురం: అందరిలోనూ ఉన్నత లక్ష్యాలు సాధించే సమర్థత ఉంటుందని, అయితే సరైన విధానాన్ని ఎంపిక చేసుకొని అంకితభావంతో కృషి చేయాలని టొబొకా బోర్డు సెక్రటరీ, (గుంటూరు) అద్దంకి శ్రీధర్ బాబు సూచించారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో × సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి.. ఎలా రాయాలి, వ్యూహాలు – విజేతగా నిలవడం? అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యలో జీవిత ఆశయాన్ని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు సంకల్ప బలం ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. సివిల్ సర్వీసెస్ లక్ష్యాన్ని ఎంచుకుని, మీరు సాధించాలన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అంతకు ముందు అద్దంకి శ్రీధర్ బాబు జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దనను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్లంజరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ శిక్షణ, ఉచిత మెటీరియల్ అవకాశం కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సుజాత, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ వి.శంకర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి, ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, విభాగాధిపతులు డాక్టర్ ఎస్. చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ కే.ఎఫ్. భారతి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర రెడ్డి, డాక్టర్ దిలీప్, బి.అజిత పాల్గొన్నారు.

భౌ బోయ్!



• నగరంలో కుక్కల స్వైర విహారం'
• అధికమవుతున్న కుక్కల దాడి కేసులు
• గత నాలుగు నెలల్లో 1,835 కేసుల నమోదు

అనంతపురం క్రైం: నగరంలో కుక్కల స్వైర విహారంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కల గుంపులు సంచరిస్తున్నాయి. కుక్కలు దాడిలో గాయపడిన వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంటి నుంచి వీధుల్లోకొస్తే చాలు.. అమాంతం దాడి చేస్తున్నాయి. కుక్కల దాడి బాధితులు సర్వజనాస్పత్రికెళ్లి ఇంజెక్షన్లు వేయించుకోవాల్సి వస్తోంది.

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గత నాలుగు నెలల్లో 1,835 మంది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ మొదటి డోస్ వేసుకున్నారు. ప్రతి నెలా 26 నుంచి మరుసటి నెల 25 వరకు గణాంకాల ప్రకారం ఈ స్థాయిలోనే కేసులు నమోదవుతున్నాయి. అందులో 1,050 పురుషులు, 464 మంది మహిళలు, 213 మంది మగ పిల్లలు, 108 మంది ఆడపిల్లలు ఉన్నారు. జిల్లాలోని అనంతపురం, అనంతపురం రూరల్, రుద్రంపేట, రాజీవ్ కాలనీ, బీకేఎస్, తదితర ప్రాంతాల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో కేసులు వస్తున్నట్లు ఆస్పత్రి రికార్డుల్లో నమోదైంది. వీటిలో ముఖ్యంగా 50 శాతం వరకు అనంతపురం నియోజకవర్గంలోనే నమోదవుతున్నట్లు సమాచారం. అశోక్‌నగర్, సాయినగర్, హౌసింగ్ బోర్డు, రాణినగర్, మున్నానగర్, రజక్‌నగర్, ఆజాద్‌నగర్, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కుక్కకాటు బాధితులున్నారు.

ముందుకుసాగని స్టెరిలైజేషన్ ప్రక్రియ..
కుక్కల సంతానోత్పత్తిని తగ్గించడానికి స్టెరిలైజేషన్ ప్రక్రియ చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు గత కొన్ని నెలలుగా కసరత్తు చేస్తూనే ఉన్నారు. కంపోస్టు యార్డులో కుక్కలను స్టెరిలైజ్ చేసేందుకు ఓ షెడ్డు ఏర్పాటు చేశారు. అందులో 77 కెన్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఇంత వరకూ ఈ ప్రక్రియకు ఎలాంటి ముందుడుగూ పడలేదు.



హౌసింగ్ బోర్డులో కుక్కల గుంపు

జిల్లాస్థాయి ఆర్చరీలో విద్యార్థుల ప్రతిభ

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ అర్చరీ జిల్లా స్థాయి పోటీల్లో శింగనమల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, పీడీ నందనకుమార్ తెలిపారు. అండర్–14 కాంపౌండ్ రౌండ్‌లో బి. కార్తీక్, అండర్–14 రికర్ బాయ్స్‌లో కే.గోవర్ధన్ రెడ్డి, బాలికల విభాగంలో డీ.నిహారిక, హాసిని, సాయిశ్రీ, సుస్మిత, అండర్–17లో జాహ్నవి, రికర్ బాయ్స్‌లో బి. అశోక్, ఇండియన్ బాయ్స్‌లో యోగేంద్ర ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ ,ఉపాధ్యాయులు అభినందించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరు: ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతుల పొలాలను ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించారు.

సమస్యలు పరిష్కరించాలి



జిల్లా ఖజానా శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపున్న పెన్షనర్లు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని శనివారం జిల్లా ఖజానాశాఖ కర్యాలయం ఎదుట పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలియజేశారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దన్న గౌడ్, జయరామప్ప మాట్లాడారు. జిల్లా పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏటీఓ రాణికి నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ప్రభాకర్, ఖలందర్‌బాషా, మహమ్మద్, నారాయణ, రమేశ్‌కుమార్, రఘురాం దయాల్ పాల్గొన్నారు.

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఓ బఫూన్

• బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ

రాప్తాడురూరల్: రోజుకో పార్టీ మారుతూ, పూటకో మాట మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఓ బఫూన్ అని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ మండిపడ్డారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాయలసీమ హక్కు అయిన నీళ్లు, ప్రాజెక్టులు, కడప ఉక్కు, గుంతకల్లు రైల్వే జోన్, అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణం, బ్రిడ్జి కం బ్యారేజ్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తదితర ప్రాజెక్టులు ముందుకు సాగకుండా పోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కారణమని బైరెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు మీ నాయకుడు చంద్రబాబును మొదటి ముఖ్యమంత్రి చేస్తే బీజేపీతో అంట కాగి, రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారని విమర్శించారు. నువ్వు చేసిన మోసం, నీ రక్తచరిత్ర తెలిసిన ప్రజలు నీకు ఎప్పుడో రాజకీయ సమాధి కట్టారన్నారు. రాయలసీమ ఉద్యమాన్ని హననం చేసిన హంతకుడు బైరెడ్డి అన్నారు. మానవ విలువలకు నిలువెత్తు సాక్ష్యంగా రాష్ట్ర పాలన సాగిస్తూ, ప్రపంచంలోనే అత్యుత్తమ సంస్కరణ వాదిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. జగన్ కాలిగోటికి కూడా పనికిరాని నీ మాటలు..పచ్చ మీడియా ప్రధాన శీర్షికలో రాయడం దిగజారుడుతనమేనన్నారు.

రామాయణం ఆచరణాత్మక గ్రంథం

అనంతపురం కల్చరల్: రామాయణం పారాయణ గ్రంథమే కాదు.. ఆచరణాత్మక గ్రంథమని శృంగేరీ విరూపాక్ష మఠ పీఠాధిపతులు శ్రీవిద్యానృసింహ భారతీ స్వామీజీ అన్నారు. శనివారం రాత్రి సాయిట్రస్టు ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని శ్రీ రమాసమేత సత్యనారాయణస్వామి ఆలయంలో ఏడు రోజుల పాటు జరిగే రామాయణ సప్తాహాన్ని స్వామీజీ ప్రారంభించారు. నిర్వాహకులు విజయ్‌కుమార్, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.